126) రామక్రియ

ప॥ ఇట్టిజీవుల కింక నేది వాటి । దట్టమై దేవుడ నీవే దయజూతుగాకా ॥

చ॥ తనజన్మ విధులను దలచు నొక్కొకవేళ । వొనర మఱచు నట్టి వొక్కొకవేళ ।
విను బురాణకథలు వివరించి యొకవేళ । పెనచి సందేహములె పెంచు నొకవేళ ॥

చ॥ విసిగి సంసారమందు విరతిడౌ నొకవేళ । వొసగి యందె మత్తుడౌ నొకవేళ ।
పసిగొని యింద్రియాలబంటై వుండు నొకవేళ । ముసిపితో దైవానకు మొక్కు నొక్కవేళ ॥

చ॥ కోరి తపములు చేసి గుణియౌ తా నొకవేళ । వూరకే అలసివుండు నొక్కవేళ ।
యీరీతి శ్రీవేంకటేశ యెదలో నీ వుండగాను । బీరాన నీకే మొఱవెట్టు నొకవేళ ॥